RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006 9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 353 పేజీలు - 05 వెల - 04/- గురువారం 05 సెప్టెంబర్ 2024



## నా ప్రజల కష్టాలు తీరేదాకా

# నా ఇల్లు కలెక్టర్ కార్యాలయమే.!

మిగతా 2లో

- స్పీడుగా బురద తొలగింపు...వీధుల శుభ్రం చేసే పని
- పనుల కోసం 2,100 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఏర్పాటు
- వ్యాధులు ప్రబలకుండా 62 మెడికల్ క్యాంపులు ఏర్పాటు
- వైకాపా బురద రాజకీయాలపై ఆగ్రహం
- వరద ప్రాంతాల్లో పర్యటించాలని అమిత్‌షాకు వినతి
- మీడియా సమావేశంలో సిఎం చంద్రబాబు వెల్లడి

**ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 04:** అలుపెరగకుండా వరద సహాయక చర్యలు చేపడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రజల కష్టాలు తీరే దాకా కలెక్టరేట్‌లోనే ఉంటానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో వరదల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగు రోజులుగా సహాయ చర్యల్లో మునిగారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న విజయవాడను కాపాడేందుకు పగలు, రాత్రి ఆయన శ్రమిస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన తన ఇంటికి వెళ్లకుండా కలెక్టరేట్‌లోనే ఉంటూ.. బస్సులో నిద్రపోతూ ప్రజల కోసం కష్టపడుతున్నారు. వరుసగా నాలుగో రోజు బుధవారం ఉదయం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై సహాయ చర్యల్లో నిమగ్నమయ్యారు. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు.

# బుడమేరు ఆక్రమణలే వరదలకు కారణం

### సింగ్ నగర్ లో వరద బాధితులను పరామర్శించిన షర్మిల
### హైడ్రా మాదిరి బుడమేరు ఆక్రమణలను తొలగించాలని సూచన



విజయవాడ, ఆంధ్ర ప్రగతి సెప్టెంబర్ 4:ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విజయవాడలోని వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. వరద ముంపునకు గురైన సింగ్ నగర్ ప్రాంతంలోని బాధితులను ఆమె పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... వరద బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటిస్తూ ప్రజలకు ధైర్యం చెపుతుండటం మంచి విషయమని చెప్పారు. విజయవాడ వరదలకు బుడమేరే కారణమని అన్నారు. కొంప కొల్లేరయిందని... బెజవాడ బుడమేరు అయిందని షర్మిల వ్యాఖ్యానించారు. బుడమేరు ద్వారా వచ్చే వరద నీరు కొల్లేరుకు చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మరోసారి ఇలాంటి విపత్తు రాకుండా చూడాల్సిన బాధ్యత సీఎం చంద్రబాబుపై ఉందని చెప్పారు. బుడమేరు రక్షణకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణలో హైడ్రా తరహాలో... బుడమేరు ఆక్రమణలను కూడా వెంటనే తొలగించాలని అన్నారు.

# ఐ (వై)పీఎస్'లపై ఎఫ్ఐఆర్‌లు..?



4లో

# వరదబాధితులను ఆదుకోవడంలో విఫలం

### ముఖ్యమంత్రిగా చంద్రబాబు అనర్హుడు
### నీటమునిగిన పలు కాలనీల్లో జగన్ పర్యటన

విజయవాడ, ఆంధ్ర ప్రగతి సెప్టెంబర్ 4: వరద బాధితులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫెయిల్ అయ్యారని మాజీ సీఎం జగన్ విమర్శించారు. బాధితులను ఆదుకునేందుకు ఏమీ చేయడం లేదని అన్నారు. ఎక్కడా రిలీఫ్ క్యాంపులు లేవని, నిరాశ్రయులైన వారిని తరలించడం కూడా జరగడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి పదవిలో ఉండడానికి చంద్రబాబు అనర్హుడని అన్నారు. అధికారంలోకి వచ్చి 4 నెలలు అవుతున్నప్పటికీ.. అధికారులు అందరికీ తనకు నచ్చినట్లుగా పోస్టింగ్‌లు ఇచ్చుకున్నారని అన్నారు. అలాంటి అధికారులు తప్పు చేసేలా చంద్రబాబు ఎలా వ్యవహరించారని జగన్ ప్రశ్నించారు. విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరి పేటలో నీట మునిగిన కాలనీల్లో వైఎస్ జగన్ పర్యటించారు. అక్కడ వరద బాధితులతో మాట్లాడారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. ఇది పూర్తిగా మ్యాన్ మేడ్ ఫ్లడ్స్ అని జగన్ మరోసారి పునరుద్ఘాటించారు. క్రిష్ణా నది కరకట్ట మీద ఉన్న చంద్రబాబు ఇంటిని ముంపు నుంచి కాపాడేందుకే క్రిష్ణాలోని నీటిని బుడమేరులోకి గేట్లు ఎత్తి వదిలారని జగన్ మరోసారి చెప్పారు. దాని వల్లనే బుడమేరు నుంచి వరద విజయవాడను ముంచెత్తిందని అన్నారు. గురువారమే వరద రాబోతోందని తెలిసినప్పుడు.. డ్యామ్ మేనేజ్‌మెంట్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అసలు ప్రణాళికబద్ధంగా వ్యవహరించి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాజరాజేశ్వరి పేట వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన.. బాధితులను పరామర్శించారు.



# బురద జల్లే కార్యక్రమం మానండి

- వీలైతే సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి
- వైకాపా కార్యకర్తలు సమాయచర్యల్లో దిగాలి
- విపత్తుల సమయంలో చంద్రబాబు అనుభవం పనికొస్తోంది
- ఆయనలా కష్టపడడం ఎవరికీ సాధ్యం కాదు
- వరదసహాయకచర్యలకు అంతరాయమనే తాను వెళ్లడంలేదు
- తెలంగాణకు కోటి సాయం ప్రకటించిన డిప్యూటి సిఎం పవన్



## గ్రామాలకు 4కోట్ల సాయం

**విజయవాడ, ఆంధ్ర ప్రగతి సెప్టెంబర్ 4:**

విపత్తు సమయంలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. సిఎంగా చంద్రబాబు అనుభవం ఏంటో ఇప్పుడు తెలుస్తున్నదని అన్నారు. వైకాపా విమర్శలు ప్రస్తావిస్తూ..రాళ్లు వేయడం సులువని, పనిచేసేవారికి ఎంత కష్టపడుతున్నారో తెలుస్తుందని అన్నారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బుడమేరులోని 90 శాతం ఆక్రమణలే విజయవాడకు శాపంగా మారాయని పవన్ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు సమర్థంగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ వయసులోనూ జేసీబీలు, ట్రాక్టర్లు ఎక్కి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారన్నారు. ఆయన్ను అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం సరికాదని వైకాపా నేతలను ఉద్దేశించి హితవు పలికారు. వైకాపా నేతలు ముందు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని.. ఆ తర్వాతే ఆరోపణలు చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లడం లేదంటూ వైకాపా నేతలు చేస్తున్న విమర్శలపై పవన్ స్పందించారు. తాను వెళ్తే సహాయక చర్యలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. అధికార యంత్రాంగానికి ఒత్తిడి ఉంటుందని చెప్పడంతో తాను వెళ్లలేదని చెప్పారు. ఇంకా విమర్శించాలనుకుంటే వైకాపా నేతలు నాతో పాటు ఎక్కడికైనా రావొచ్చు. నా కాన్వాయ్‌లోనే తీసుకెళ్తాను. నాతో నడవండి.. ఎలా ఉంటుందో చూడండి. అప్పుడు మీరే సలహా ఇస్తారు. ఇది రాష్ట్ర సమస్య. వైకాపా నేతలు సహాయం చేసి మాట్లాడాలి. ఇళ్లలో కూర్చొని విమర్శలు చేస్తే సరిపోదని పవన్ వ్యాఖ్యానించారు. సహాయ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది పాల్గొంటున్నారని పవన్ తెలిపారు. 175 బృందాలు విజయవాడ అర్బన్‌లో పనిచేస్తున్నాయని అన్నారు. వరద ప్రభావం లేని జిల్లాల నుంచి వచ్చిన 900 మంది పారిశుద్ధ్య కార్మికులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు వివరించారు. వరదలకు ఎక్కువగా ఎన్టీఆర్ జిల్లా దెబ్బతిందని తెలిపారు. 26 ఎన్డీఆర్ఎఫ్, 24 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. నేవీ నుంచి 2, ఎయిర్‌ఫోర్స్ నుంచి 4 హెలికాప్టర్ల ద్వారా ఆహార పంపిణీ జరుగుతోందని చెప్పారు. ఇదిలావుంటే బాధితులను ఆదుకోవడమంటే మాటలు చెప్పడం కాదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిరూపించారు. ఏకంగా రూ.4 కోట్ల వరద సాయాన్ని ఆయన ప్రకటించారు. వరద ప్రభావిత గ్రామాలకు ఆయన ఈ విరాళం అందించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# నశ్యం కుటుంబంలో

## మరో రాజకీయ ఆణిముత్యం

# ఎన్.ఎం.డి.ఫిరోజ్..!



- -సహనం..ఓర్పు,విధేయతతో ప్రజల్లో గుర్తింపు.
- -రాజకీయాల్లో తండ్రికి తగ్గ తనయుడిగా మంచి పేరు.
- -అభివృద్ధికి కోట్లు విలువచేసే స్థలాలు ఇచ్చిన ఘనత నశ్యం కుటుంభానిదే.
- -యువనాయకుడు ఎన్.ఎం.డి.ఫిరోజ్ జన్మదినం.
- -పుట్టినరోజు వేడుకల్లో సేవా కార్యక్రమాలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 04:** రాజకీయాలు పలుకుబడి,హోదా, సంపాదన,హంగు,ఆర్భాటం, చెప్పిందే వేదం,చేసుకున్నోళ్ళకు చేసుకున్నంత రాజకీయంలో ఉంది.రాజకీయాల్లో ఒక్కసారి పదవి వస్తే కొందరు చేయని అక్రమాలు,సంపాదన ,చెడ్డ పేరు అంతా ఇంతా కాదు.దేశవ్యాప్తంగా రాజకీయాల్లో ఎవరిని చూసినా వెళ్లలో అవినీతి ,మచ్చలేని నాయకులు కొందరే కనిపిస్తారు.రాజకీయాల్లో 40 ఏళ్లు గా కొనసాగుతూ ముచ్చటగా మూడు సార్లు మంత్రి పదవులు పొంది నాలుగో సారి మంత్రి పదవి చేస్తున్న నశ్యం వంశానికి చెందిన ఎన్.ఎం.డి.ఫరూఖ్ కె చెందుతుంది.సుధీర్ఘ రాజకీయంలో ఆటుపోట్లు,త్యాగాలు,అభివృద్ధికి కోట్లు విలువ చేసే స్థలాలు ఇస్తూ అవినీతి,అక్రమ సంపాదన,అధికార దర్పం లేకుండా నేటికీ రాజకీయంలో సహనం,ఓర్పు కల్గిన సీనియర్ నాయకులుగా 75 ఏళ్ల వయసులో సైతం అందరి మన్ననలు పొందుతున్నారు.వయసు మీదపడంవల్ల రాజకీయంగా,ప్రజాసేవ చేయడంలో ఇంట్రెస్ట్ ఉన్న అయిదు మంది కుమారుల్లో రాజకీయ ఆణిముత్యం గా ఎన్.ఎం.డి.ఫిరోజ్ ను గుర్తించారు.మంత్రి ఫరూక్ 1983 నుంచి రాజకీయ రంగప్రవేశం చేసి నాటి నుంచి నేటివరకు నాలుగుసార్లు నంద్యాల ఎమ్మెల్యే గా గెలుపొందిన ప్రతి సారి మంత్రి పదవులు పొంది ఆ శాఖకే వన్య తెచ్చారు.పార్టీ అధిష్ఠానం మేరకు రెండు సార్లు త్యాగం చేశారు.2024 లో గెలుపొంది మరోసారి మంత్రి పదవి పొందారు.ఈ నేపథ్యంలోనే కుమారుడు ఎన్.ఎం.డి.ఫిరోజ్ కు రాజకీయాల్లో ఆసక్తిని గమనించారు.కొన్నేళ్లుగా తండ్రి వెంట తిరుగుతూ రాజకీయ ఓనమాలు నేర్చుకున్నారు.ప్రజలు,అధికారులు,కార్య కర్తలతో తండ్రి మాట్లాడేవిదానాన్ని గమనించారు.రాజకీయంలో కోపం,సహనం,ఓర్పు,విధేయత కలిగిఉండి,అక్రమార్జన కు దూరంగా ఉంటే ప్రజలకు దగ్గర అవుతామని గ్రహించారు.నాటి నుంచి నేటి వరకు పట్టణంలో అన్ని వార్డుల్లో తిరుగుతూ ప్రధానంగా యువతను ఆకర్షిస్తూ తనదైన రాజకీయ మార్క్ వేసుకున్నారు.కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ ఫిరోజ్,ఫిరోజ్ అనే స్థాయిని కల్పించుకున్నారు. మరో వైపు తాతల కాలం నుంచి ఉన్న పెద్ద ఆస్తులు ఉన్నా,తండ్రి ఎన్నో మంత్రి పదవులు వచ్చినా ఎక్కడా అధికార దుర్వినియోగానికి పాల్పడకపోవడం విశేషం.ప్రస్తుత రాజకీయాల్లో ఒకసారి గెలిస్తే అన్నా,తమ్ముడు,మామా,బావమరిది సైతం అధికార దుర్వినియోగం కు పాల్పడటం తెలిసిందే.ఆ కుటుంభం మొదటి నుంచి ఆస్తి పరంగా,రాజకీయ పరంగా ఎంతో పేరు ఉన్నా ఆ కుటుంబానికి నేటి వరకు మచ్చలేని కుటుంభం అంటే అతిశయోక్తి.నంద్యాల పట్టణం గతంలో సరైన అభివృద్ధికి నోచుకోలేదు.ప్రధానంగా శ్రీశైలం,మహానంది కి వెళ్ళడానికి సరైన దారి లేకపోవడంతో శ్రీనివాస సెంటర్ లో కోట్లు విలువచేసే స్థలాన్ని ఫరూక్ అప్పట్లో ప్రభుత్వానికి ఇచ్చారు.పద్మావతి నగర్,నందమూరి నగర్ ఇలా పలు ప్రాంతాల్లో సొంత స్థలాలు ఇవ్వడంతో ఆ కుటుంభం నష్టపోయినా ఎందరో కుటుంబాలు,రియల్ ఎస్టేట్ వ్యాపారులు లాభపడ్డాడు.ప్రజల సేవే ముఖ్యం అని తలంచారు.మచ్చలేని కుటుంబంలో రాజకీయంగా బుడి,బుడి అడుగులు వేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఫిరోజ్ కు మంచి పేరు వచ్చింది.పదవులు వచ్చాయి అనే అహంకారం లేకుండా ప్రజల కు అభివృద్ధి ఫలాలు అందించేందుకు వార్డుల్లో తిరుగుతూ తనదైన శైలిలో ప్రజలతో కలిసిపోతున్నారు.పేద ప్రజల,యువనాయకుడుగా పేరు తెచ్చుకున్న ఎన్.ఎం.డి.ఫిరోజ్ పుట్టినరోజుకు వాడ, వాడల ప్రజలు,కార్యకర్తలు,యువత,అభిమానులు భారీ గజమాలలు,భారీ కేకులు కట్ చేసి సంబరాలు చేశారు.ఆయన పుట్టినరోజు వేడుకలకు ఉదయం నుంచి రాత్రి వరకు పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు.అన్నదానాలు, రక్తదానాలు నిర్వహించారు.ఆస్తులు పెద్దవారు ఎంతో



సంపాదించారు,అస్థితో పాటు నిజాయితీ బతకాలని పెద్దలు చెప్పారు.కోట్లాది రూపాయల స్థలాలు పెద్దవారు ప్రజల కోసం ఇస్తున్నా ఏ నాడూ కుటుంబసభ్యులు భదపడిన దాఖలాలు లేవని ,డబ్బు,స్థలాల కంటే ప్రజల అభిమానం,ఆశీస్సులు ముఖ్యమని భావించి నశ్యం కుటుంబానికి జై కొట్టాల్సిందే.

## ఎన్ఎండి ఫిరోజ్ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేసిన స్టూడెంట్ లీడర్ ముద్దం నాగ నవీన్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 04: నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పుట్టినరోజు సందర్భంగా విజయ బ్లడ్ బ్యాంక్ సద్దాం మరియు వారి మిత్రబృందం ఏర్పాటుచేసిన బ్లడ్ డొనేషన్ క్యాంపులో తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎన్ఎస్ఎఫ్) నంద్యాల జిల్లా అధ్యక్షులు ముద్దం నాగ నవీన్ పాల్గొని 27 వ సారి రక్తదానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ముద్దం నాగ నవీన్ మాట్లాడుతూ మంత్రి ఫరూక్ తనయుడు నంద్యాల ఆశాజ్యోతి , యువ కిరణం టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు అలాగే జీవితంలో రెండు దానాలు గొప్పవని ఒకటి అన్నదానం రెండోది రక్తదానం. మొదటిది కడుపునింపితే.. రెండోది సాటి మనిషి ప్రాణాలు నిలుపుతుందన్నారు. ఉరుకులు పరుగుల జీవితంలో కొందరు కొంత సమయాన్ని సామాజిక కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారని.



తమకు తోచిన సాయం చేస్తూ.. పేదలకు కొండంత అండగా ఉంటున్నారన్నారు వారందరికీ ధన్యవాదాలు తెలియజేసుకుంటూ రక్తదానంపై అపోహలు వద్దని ఎవరైనా రక్తదానం చేయవచ్చన్నారు. అత్యవసర సమయాల్లో రక్తదానం చేస్తే ఆపద్బాంధవులలు అవుతారన్నారు. అనంతరం రక్తదానం చేసిన నవీన్ ను ఎన్ఎండి ఫిరోజ్ అభినందించారు ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## నంద్యాలలో ఘనంగా ఎన్ఎండి ఫిరోజ్ గారి పుట్టినరోజు వేడుకలు.







ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 04: నంద్యాలలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పుట్టినరోజు వేడుకలు చాలా ఘనంగా జరిగాయని . ఊరు వాడ పల్లె అంతా ఏకమై గజ మాలలతో , కేకులతో , మేళ తాళాలతో ఒక పండుగ వాతావరణం లో ఎన్ఎండి ఫిరోజ్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. ప్రజల అభిమానాన్ని నేనెప్పటికీ మర్చిపోలేనని నాపైన ఎనలేని అభిమానంతో నాకు సోషల్ మీడియా ద్వారా ఫోన్ ద్వారా నేరుగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని అంతేకాకుండా నంద్యాలలో అన్నదాన కార్యక్రమాలు పుస్తకాలు పంపిణీ దుప్పట్లు పంపిణీ లాంటి కార్యక్రమాలు చేయడం చాలా సంతోషంగా ఉందని మీ అందరి ఆప్యాయత అనురాగాలు నాపై ఇలాగే ఉంచాలన్నారు. అనంతరం అభిమానులు మాట్లాడుతూ ఫిరోజ్ నిండు నూరేళ్లతో అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారికి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశామని వారు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ప్రజలు తెలియజేశారు.

## వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

### - నంద్యాల జిల్లా గణేష మహోత్సవ కేంద్ర సమితి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 04: వినాయక చవితి ఉత్సవాలను నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరుపుకోవాలని నంద్యాల జిల్లా శ్రీ గణేశ మహోత్సవ కేంద్ర సమితి వారు పిలుపునిచ్చారు.

ఈ సందర్భముగా జిల్లా అధ్యక్షులు చిలుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విఘ్న వినాయకుడుగా అన్ని విఘ్నాలను దూరం చేసే ఆది దేవుడి పండుగను జరుపుకోవడానికి అధికారులు అనుమతుల పేరుతో ఇబ్బంది కి గురి చేయకుండా సానుకూల వాతావరణాన్ని కల్పించాలని అన్నారు. జిల్లా కార్యాధ్యక్షులు చంద్ర మౌళీశ్వర రెడ్డి మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాల్సిన పండుగ మరియు నిమజ్జన కార్యక్రమాలను సినిమా పాటలు డాన్సులతో కాకుండా భక్తి పాటలు సాంస్కృతిక కార్యక్రమాలతో జరుపుకోవాలని సూచించారు. పర్యావరణ హిత గణేశ ప్రతిమలను మాత్రమే పూజించాలని అందరికీ ముందస్తుగా వినాయక చవితి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణేశ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులు రామాంజనేయులు రాజశేఖర్ రెడ్డి విష్ణు వర్ధన్ రెడ్డి సందీప్ శివ నరసింహ గౌడ్ డా:నేట్ల మహేశ్వర రెడ్డి శ్రీకాంత్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నా ఇల్లు కలెక్టర్ కార్యాలయమే.!

*(మొదటి పేజీ తరువాయి)*

విజయవాడలో సాధారణ స్థితి వచ్చేవరకు కలెక్టరేట్?లోనే ఉండాలని సీఎం చంద్రబాబు నిర్ణయించుకున్నారు. 'ప్రజలు ఇంటి నుంచి బయటకు సరదాగా వచ్చి వెళ్లే వరకు నా ఇల్లు కలెక్టర్ కార్యాలయమే!' అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సహాయ చర్యలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మరింత కష్టపడి బాధితులను ఆదుకోవాలని అధికారులకు సూచించారు. ముంపు ప్రభావిత ప్రాంతాల శు భ్రతపై దృష్టి సారించాలని చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలపై మంత్రులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు.'వరద ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా చర్యలు చేపట్టి సాధారణ స్థితికి తీసుకొస్తున్నాం. ప్రతి ఇంటికి సహాయం అందించాలి. వరదల్లో చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాల వారికి అప్పగించాలి. వరూ ముందుకు రాకపోతే ప్రభుత్వం తరఫున గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించాలి. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహార అందించాలి. వరద తగ్గుముఖం పట్టడంతో ఆహారం గడప గడపకు వెళ్లే అవకాశం ఉంది. ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, లీటర్ పామాయిల్, 2 కిలోలలు ఉల్లిపాయలు, 2 కిలోల బంగాళదుంప, కిలో చక్కెర అందించాలి' అని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశించారు.మొబైల్ రైతు బజార్లు ఏర్పాటు చేసి బ్లాక్ మార్కెటింగ్ లేకుండా అతి తక్కువ ధరకు కూరగాయలు విక్రయించేలా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు చెప్పారు. 'నష్టాన్ని వివరించి కేంద్ర సాయం కోరదాం. ఆహారం, నీరు, బిస్కెట్స్, పాలు, అరటిపండ్లు అన్నీ డోర్ టు డోర్ అందాలి. అన్ని అంబులెన్స్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచం. విద్యుత్ పునరుద్ధరణ వేగవంతం చేయాలి. శానిటేషన్ పనులు ఒక యుద్ధంలా జరగాలి. ప్రతి ఇంటిని శుభ్రం చేసేప్పుడు ఇంటికి సంబంధించిన వారిని భాగస్వామ్యులను చేయండి' అని చంద్రబాబు సూచనలు చేశారు. వైరల్ ఫీవర్లు, దోమల బెడద ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో ప్రజలకు జాగ్రత్తలు చెప్పాలని సీఎం చంద్రబాబు సూచించారు. 'ప్రతి సచివాలయంలో ఒక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి. ఎవరికి ఏ మందులు కావాలన్నా అందించాలి. పంట నష్టంపై అంచనాలు నమోదు చేయండి' అంటూ ఆదేశాలు జారీ చేశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

గురువారం 05 సెప్టెంబర్ 2024

# చదలవాడ ఉమేశ్ చంద్ర సేవలు చిరస్మరణీయం

## -సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.

ఆంధ్ర ప్రగతి డోన్ సెప్టెంబర్ 04:
ఆంధ్రప్రదేశ్ కి చెందిన పేరు గాంచిన పోలీస్ ఉన్నతోద్యోగి చదలవాడ ఉమేశ్ చంద్ర వర్ధంతి సందర్భంగాడోన్ పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ నందు సామాజిక కార్యకర్త పి.మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో డోన్ రూరల్ సిఐ సిఎం రాకేష్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కి చెందిన పేరు గాంచిన పోలీస్ ఉన్నతోద్యోగి ఉమేశ్ చంద్ర వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు.వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డోన్ రూరల్



సిఐ సిఎం. రాకేష్,సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూ..ప్రతి పోలీసు, అధికారులకు ఆదర్శప్రాయుడు దివంగత ఉమేష్‌చంద్ర అని డోన్ రూరల్ సీఐ సిఎం.రాకేష్, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి పేర్కొన్నారు. అలాగే ప్రజా సమస్యలు తన సమస్యలుగా భావించే మంచి క్రమశిక్షణ కలిగిన అధికారిగా ఉమేశ్ చంద్ర పేరు తెచ్చుకున్నారు. దుర్మార్గుల తూటాలకు బలైన ఉమేష్ చంద్ర తెలుగు ప్రజల హృదయాలలో చిరస్మరణీయంగా నిలిచియున్నారని కొనియాడారు. అలాగే ప్రతి పోలీస్ గుండె లో ఆయన చెరగని ముద్రగా నిలిచారని డోన్ రూరల్ సిఐ సిఎం. రాకేష్, సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.మన దేశం కోసం ప్రాణలు అర్పించిన వీరులను ఎల్లవేళల స్మరించుకోవాలని, మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను,శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ మన మందరం వారి అడుగుజాడలలో నడుద్దామని డోన్ రూరల్ సిఐ సీఎం.రాకేష్ సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.

# వరదల్లో నష్టపోయిన ప్రజలను రైతులను ఆదుకోవాలి

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 04:
గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇళ్లలోకి నీరు చేరి నష్టపోయిన ప్రజలను, పంట పొలాలు మునిగిపోయి బాధపడుతున్న,నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణంలోని సిపిఎం జిల్లా కార్యాలయం నందు జిల్లా విస్తృత సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ విస్తృత సమావేశానికి నంద్యాల జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి యేసురత్నం అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు, ఎం నాగేశ్వరరావు లతోపాటు జిల్లా లోని పట్టణ, మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. అనంతరం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ లు రాష్ట్రంలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలంతా తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, ఇప్పటికే పంటలు వేసుకుని నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అన్నారు.




కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో నష్టపోయిన రైతాంగాన్ని , ప్రజలను ఆదుకునేందుకు విపత్తుల సహాయం కింద నిధులను విడుదల చేయాలని అన్నారు. అదేవిధంగా నంద్యాల జిల్లాలోని చామకాలువ, కుందునది, మద్దిలేరు వాగు, తెలుగుగంగ, కెసి కెనాల్ లు నిండిపోయి వాటి ద్వారా నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలని ,భవిష్యత్తులో వరదల నుండి నష్టపోకుండా ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని అన్నారు. వరదలు వచ్చిన ప్రతిసారి నంద్యాల పట్టణమంతా పూర్తిగా నిండిపోయి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నుండి చామకాలువ, కుందునది , మద్దిలేరువాగుల వెంట రక్షణ గోడను నిర్మించాలని, గతంలో నిధులను కేటాయిస్తే వాటిని ఉపయోగించడంలో ప్రజాప్రతినిధులు ఘోరంగా విఫలమయ్యారని, దానివల్లే నేడు ప్రజలు వరదలు వచ్చిన ప్రతిసారి తీవ్రంగా నష్టపోవడం జరుగుతుందని అన్నారు. చిన్నపాటి వర్షానికి నంద్యాల పట్టణం అంతా బురదమయంగా మారుతుందని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అన్నారు. అదేవిధంగా ఎక్కడైతే ప్రజల ఇబ్బందులు పడుతున్నారో వారిని సిపిఎం కార్యకర్తలు ప్రజాసంఘాల నాయకులు సహాయం చేయాలని అధికారులను ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ ఉండాలని ప్రజలకు సాయం అందించడంలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. ముఖ్యంగా రాబోయే నెల రోజుల్లో జిల్లాలోని పార్టీ కార్యకర్తలు అంతా పార్టీ శాఖల సమావేశాలు నిర్వహించి మహాసభలు జరపాలని వాటి జయప్రదం కోసం కృషి చేయాలని, గత మూడు సంవత్సరాల కాలంలో చేసిన పోరాటాలను వివరిస్తూనే జరిగిన పొరపాట్లను , మిగిలిపోయిన కార్యక్రమాలను పూర్తి చేయడం కోసం భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని ,పార్టీ అభివృద్ధికి బాటలు వేసుకునే విధంగా ప్రతి కార్యకర్త ప్రణాళికలను రూపొందించుకోవాలని గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారం కృషి చేయాలని అన్నారు.

# వినాయక నిమజ్జోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోండి

## -ప్రతి మండపంలో అగ్ని ప్రమాద నివారణ పరికరాలు సిద్ధంగా ఉంచుకోండి.

## -జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మజ






ఆంధ్రప్రగతి నంద్యాల,సెప్టెంబర్ 04:
వినాయక నిమజ్జన మహోత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మజ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కమిటీ సభ్యులను సూచించారు.బుధవారం కలెక్టరేట్ లోని సెంటనరీ హాలులో వినాయక నిమజ్జన మహోత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, నంద్యాల డిఎస్పి యుగంధర్ బాబు, ఆళ్లగడ్డ డిఎస్పి రవికుమార్, కేంద్ర గణేష్ మహోత్సవ కమిటీ సభ్యులు జి రామకృష్ణారెడ్డి, జి విజయ్ కుమార్, సివి చలం బాబు, నిమ్మకాయల సుధాకర్, నాగేంద్ర, శంకర్, పుల్లయ్య, సత్యం, కృష్ణమాచారి, చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎ.పద్మజ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ జి రాజకుమారి ఆదేశాల మేరకు ఈనెల 11వ తేదీన స్థానిక చిన్న చెరువు కట్ట వద్ద ఉన్న వినాయక ఘాట్ లో వినాయక నిమజ్జన ఏర్పాట్లకు సంబంధించిన పనులు జరుగుతున్నాయన్నారు. కమిటీ సభ్యులు సూచించిన అంశాలను కూడా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆ మేర ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు గణేష్ మండపాల విద్యుత్ కనెక్షన్లకు 1100 రూపాయలు చెల్లిస్తామని, పారిశుద్ధ్యం, తాగినీటి వసతి, భారికేడ్ల ఏర్పాటు, గజ ఈతగాళ్లు, బోట్లు లైటింగ్ తదితర అంశాలన్నింటిని మొదటి కోఆర్డినేషన్ సమావేశంలో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులకు జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు.భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అగ్నిమాపక యంత్రాలన్నీ విజయవాడకు తరలించడం జరిగిందని గణేష్ మండపాలలో ఊదీ బత్తీలు, దీపారాధన, హారతి, విద్యుత్ దీపాలు వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రతి మండపంలో రెండు బకెట్ల ఇసుక, ఒక డ్రమ్ము వాటర్, బెడ్ షీట్ తప్పనిసరిగా ఉంచుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. గణేష్ విగ్రహాల ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తుతో నిమజ్జన ఏర్పాట్లకు ప్రణాళిక రూపొందించామని ఉత్సవ కమిటీ సభ్యులందరూ అధికారులకు, పోలీసులకు సహకరించాలని కోరారు. వీలైనంతవరకు డ్రమ్స్, డిజే, అధిక శబ్దాలతో వాయిద్యాలు లేకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గణేష్ విగ్రహాలు వెళ్లే రహదారులలో రోడ్డు ప్యాచ్ వర్క్ లు కూడా ప్రారంభమయ్యాయని సభ్యులు సూచించిన ప్రకారం చిన్న చెరువు కట్ట వద్ద, అవసరమైన ప్రాంతాలలో బార్కేడింగ్ పనులు కూడా చేపడతామన్నారు. నంద్యాల పట్టణంలో 11వ తేదీ ముమ్మర పారిశుధ్య చర్యలతో పాటు గుర్తించిన నాలుగు ప్రదేశాల్లో త్రాగునీటి సదుపాయం, చెరువు కట్టపై రెండు మొబైల్ టాయిలెట్లు, లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లు ను తడిచిన కర్రలతో సవరించడం వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందని సంబంధిత విగ్రహ కమిటీ సభ్యులు ముందస్తుగా విద్యుత్ అధికారులకు తెలియజేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నంద్యాల ఆర్డీఓ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ మారిన కాలమాన పరిస్థితులను బట్టి ప్రభుత్వ ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జనం మహోత్సవాలను ప్రశాంతంగా జరిగించేందుకు కమిటీ సభ్యులందరూ సహకరించి విజయవంతం చేయాలన్నారు. చెరువు కట్ట, గాంధీచౌకు, విక్టోరియా రీడింగ్ రూమ్లలో మూడు మెడికల్ క్యాంపు లతో పాటు వద్ద 108 అంబులెన్స్ ను కూడా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్లోని గణేష్ విగ్రహాన్ని తొలుత నిమజ్జనం చేసి పిదప నిరంతరాయంగా పట్టణంలోని దాదాపు 500 విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అంతకుముందు జిల్లావ్యాప్తంగా హాజరైన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనం ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డ పట్టణంలో హుబిలక షార్ట్ ఫిలిం టీజర్ విడుదల



ఆంధ్ర ప్రగతి ఆళ్ళగడ సెప్టెంబర్ 04: ఆళ్లగడ్డ పట్టణంలో బుధవారం షాది ఖానా సమీపంలో ఉన్న దర్బార్ టీ స్టాల్ నందు హుబిలక తుమారే లియే మేర ప్యార్ షార్ట్ ఫిలిం ను ఆళ్లగడ్డ కౌన్సిలర్ హుస్సేన్ భాష , డాక్టర్ సుబ్రహ్మణ్యం, అపుస్మా నంద్యాల డివిజన్ అధ్యక్షులు టి.అమీర్ భాష టీజర్ లు విడుదల చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ హుస్సేన్ భాష మాట్లాడుతూ హుబిలక డైరెక్టర్ ఇమ్రాన్ భాషకు మంచి టాలెంట్ ఉందని భవిష్యత్తులో మంచి దర్శకుడు అయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే డాక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆళ్లగడ్డ కు చెందిన యువకుడు ఈ స్థాయికి రావడం చాలా సంతోషకరమన్నారు. ఇలాగే భవిష్యత్తులో కూడా మంచి లఘు చిత్రాలు ఆవిష్కరణ చేసుకుంటూ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అపుస్మా నంద్యాల డివిజన్ అధ్యక్షులు టి.అమీర్ భాష మాట్లాడుతూ హుబిలక షార్ట్ ఫిలిం తీస్తున్న నా కుమారుని అందరూ ఆశీర్వదించాలని అలాగే తన టాలెంట్ను ప్రోత్సహించాలని కోరారు. హుబిలక డైరెక్టర్ ఇమ్రాన్ భాష మాట్లాడుతూ నేడు ఈ షార్ట్ ఫిలిం టీజర్ విడుదల సందర్భంగా ఆళ్లగడ్డ ప్రజలందరి ఆశీస్సులు ప్రోత్సాహం కావాలని ఆశిస్తూ ఈ షార్ట్ ఫిలిం ఈనెల ఆరవ తేదీన రాత్రి యూట్యూబ్లో విడుదల చేస్తాము అందరూ ఇచ్చించి మీయొక్క ఆదరాభిమానాలు కావాలని ఆశిస్తున్నాను.ఈ కార్యక్రమంలో నిర్మాత బ్రహ్మయ్య, కెమెరామెన్ గఫర్ బాబా, హుబిలక షార్ట్ ఫిలిమ్స్ సభ్యులు,నజీర్, రామయ్య, హనీఫ్, వీరేశ్వర్, మహమ్మద్ హుస్సేన్, సాదిక్ భాషా, మాబు హుస్సేన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# తిప్పారెడ్డిపల్లె గ్రామంలో భారీ వర్షానికి కూలిన మట్టి మిద్దె

ఆంధ్ర ప్రగతి రుద్రవరం సెప్టెంబర్ 04:
మండలంలోని తిప్పారెడ్డి పల్లి గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మట్టిమిద్దే కూలింది. గ్రామానికి చెందిన మద్దూరు వెంకటమ్మ తన మనవరాళ్లతో తనకున్న మట్టిమిద్దెలో జీవనం సాగిస్తున్నారు. చాలా సంవత్సరాల క్రితం నిర్మించిన మట్టి మిద్దె కావడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగ నాని మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అధికారులు కూలిన మట్టి మిద్దెను పరిశీలించిబాధితురాలకు తగిన ఆర్థికసహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# ఎరువుల అమ్మకాలు నిలిపివేత



ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 04:
మహానంది మండలం బుక్కాపురం గ్రామంలోని శ్రీకృష్ణ ఎరువులు మరియు పురుగుమందుల దుకాణంను మండల వ్యవసాయ అధికారి బి నాగేశ్వరరెడ్డి ఆకస్మిక తనిఖీ చేయడం జరిగినది. ఈ తనిఖీలో దుకాణ యజమాని సరియైన అనుమతులు చూపించనందున 6 లక్షల 72 వేల రూపాయలు విలువచేసే 24 టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేయడం జరిగినది. ఎరువుల డీలర్లు తప్పనిసరిగా తమ ఎరువుల లైసెన్సులో ఫారం ను జత చేసుకోవాలి. అదేవిధంగా ధరల పట్టికలో ఎప్పటికప్పుడు ఎరువుల వివరాలు పొందుపరచాలి రైతులకు బిల్లులు ఇచ్చేటప్పుడు తప్పనిసరిగా రైతుల దగ్గర నుంచి బిల్లు పైన సంతకాలు తీసుకోవాలి. స్టాకు రిజిస్టర్లో ఎరువుల వివరాలను ఎప్పటికప్పుడు పొందుపరచాలి.ఈ పాస్ మిషన్ ద్వారానే ఎరువులను అమ్మాలని డీలర్లను హెచ్చరించడం జరిగినది. నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు అమ్మితే ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారము వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగినది.

# ఎన్ ఎం డి ఫిరోజ్ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేసిన యువకులు.





ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 04: నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ పుట్టినరోజు సందర్భంగా నంద్యాల బ్లడ్ బ్యాంక్ వారు ఎన్టీఆర్ షాధిఖాన నందు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం వద్ద 38వ వార్డు వైస్సార్ నగర్ టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో యువకులు రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతూ మనం రక్తదానం చేయడం వలన ఒక నిండు ప్రాణాన్ని కాపాడిని వారిమి అవ్వుతాము అని రక్తం ఇవ్వడం వలన చాలా వరకు ఆరోగ్య సమస్యలు రాకుండ కాపాడు కోవచ్చు అని రక్తం ఇవ్వడం వలన ఆరోగ్యానికి చాలా మంచింది అని ఆయన అన్నారు.ఇప్పటికి 16 సార్లు రక్తదానం చేసిన వేణు గోపాల్ ని ఆయన అభినందించారు.

# ఐ (వై)పీఎస్'లపై ఎఫ్ఐఆర్‌లు..?

- ఏడుగురు ఐపీఎస్‌లపై కేసుల కత్తి.
- ఇప్పటికే ఇద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు.
- రఘురామ కేసులో పీవీ సునీల్, పీఎస్ఆర్‌పై.
- ముంబై నటి ఫిర్యాదు చేస్తే రాణా, గున్నీపైనా.?
- అన్నురాజన్, ఫక్కీరప్పపై కేసు
- పెట్టాలంటున్న సీబీఐ.
- కాకాణి కేసులో విజయారావుపై విచారణ.
- వైసీపీకి వంతపాడినందుకు చిక్కుల్లో ఐపీఎస్‌లు.
- వైఎస్ హయాంలో ఐఏఎస్‌లకు ఇదే పరిస్థితి.

ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 04: కొందరు అధికారులు ఐపీఎస్‌లమనే విషయాన్ని మరిచిపోయారు. గత ప్రభుత్వంలో వైసీపీ పెద్దలు చెప్పినట్టల్లా చేశారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఆదేశాలు అందడమే ఆలస్యం ప్రతిపక్ష నేతలతో పాటు సామాన్యులపైనా విరుచుకుపడ్డారు. చివరకు సీబీఐ అధికారులను కూడా వదిలిపెట్టలేదు. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లూ ఐపీసీని పూర్తిగా పక్కన బెట్టేసి వైసీపీ కోడ్‌ను అమలు చేశారు. పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవన్నట్టు జగన్ సర్కారు పోయి టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చింది. గత పాపాలు పాములై ఇప్పుడు వెంటాడుతుండటంతో వైసీపీకి వంతపాడిన అధికారులు దిక్కుతోచక బిక్కు బిక్కు మంటున్నారు. ఈ జాబితాలో పీవీ సునీల్ కుమార్, పీఎసఆర్ ఆంజనేయులు, కాంతిరాణా టాటా, విశాల్ గున్నీ, కేకేఎన్ అన్నురాజన్, ఫక్కీరప్ప కాగినెల్లి, సీహెచ్ విజయా రావు పేర్లు ఉన్నట్లు పోలీసు ఉన్నతస్థాయి వర్గాలలో వినిపిస్తున్నాయి. గతంలో చేసిన తప్పులకు కేసుల కత్తి వెంటాడుతోంది. ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు గతంలో నరసాపురం ఎంపీగా ఉన్నప్పుడు అప్పటి సీఎం జగన్ పాలనపై కొన్ని వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి అర్ధరాత్రి మంగళగిరిలోని సీఐడీ కార్యాలయానికి తీసుకొచ్చి లాఠీలతో చితకబాదారు. అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ వ్యవహారం పార్లమెంటులో చర్చకు దారితీసింది. అయినా జగన్ ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోలేదు. ఇటీవల ప్రభుత్వం మారడంతో ఎమ్మెల్యే రఘురామ గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 2021లో సీఐడీ చీఫ్ పీవీ సునీల్



కుమార్, ఇంటెలిజెన్స్ అధిపతి పీఎసఆర్ ఆంజనేయులు తనను అంతమొందించే కుట్ర చేశారని పేర్కొన్నారు. దీంతో గుంటూరు పోలీసులు ఇద్దరు సీనియర్ ఐపీఎస్‌లపై హత్యాయత్నం కుట్ర కేసు నమోదు చేశారు. ఈ ఇద్దరితో పాటు ప్రతిపక్షాలను హింసించడమే పనిగా వ్యవహరించిన విజయ్ పాల్ అనే అడిషనల్ ఎస్పీని సైతం నిందితుల జాబితాలో చేర్చారు. శ్రీకాకుళంలో అచ్చెన్నాయుడి నుంచి అనంతపురంలో జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడి వరకూ ఎవరినీ వదలకుండా పీఎసఆర్ ఆంజనేయులు జైలుకు పంపారు. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద రావు జీవితం అర్ధాంతరంగా ముగిసి పోవడానికి ఈ ఐపీఎస్ అధికారి వేధింపులే కారణమని అప్పట్లో ప్రతిపక్ష పార్టీలు కోడైకూశాయి. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్ ధనదాహం కోసం పలువురు ఐఏఎస్ అధికారులు జైలు పాలయ్యారు. జగన్ పాలనలో నిబంధనలకు భిన్నంగా వ్యవహరించిన ఐపీఎస్‌లను ఇప్పుడు కేసులు వెంటాడుతున్నాయి. అధికార పార్టీ మెప్పు పొందడం, కీలక పోస్టింగ్‌లు దక్కించుకోవడం కోసం ఐజీ ర్యాంకు అధికారి కాంతి రాణా, డీఐజీ ర్యాంకు ఐపీఎస్ విశాల్ గున్నీ చేయని అక్రమాల్లేవు. దేశానికి సేవ చేయాల్సిన ఐపీఎస్‌లమనే విషయాన్ని పూర్తిగా పక్కన బెట్టి వైసీపీ నేతల సేవలో తరించారు. అసెంబ్లీ సాక్షిగా విశాల్ గున్నీ రాజధాని రైతులపై ఎత్తిన లాఠీ ఎంతమంది ఒంటిపై వాతలు పెట్టిందో లెక్కలేదు. అమరావతికి జై అన్నందుకు దళిత రైతులపై అట్రాసిటీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన ఘనత గుంటూరు ఎస్పీగా ఆయనకే దక్కుతుంది. విజయవాడ డీసీపీగా ముంబై నటిని ఇక్కడికి తీసుకొచ్చి మొత్తం కుటుంబాన్నే బెదిరించిన వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇందులో పూర్తిగా సహకారం అందించిన అప్పటి విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటాకు ఇబ్బందులు తప్పేలా లేవు. బాధితులు, కుటుంబ సభ్యులు ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే చర్య తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

కడప ఎస్పీగా చరిత్రలో ఎవరూ చేయనంతగా సుదీర్ఘకాలం పనిచేసిన కేకేఎన్ అన్నురాజన్, అనంతపురం ఎస్పీగా పనిచేసిన ఫక్కీరప్ప కాగినెల్లి ఏకంగా సీబీఐతోనే పెట్టుకున్నారు. జగన్ చిన్నాన్న వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసు దర్యాప్తు చేసేందుకు సీబీఐ నియమించిన అధికారుల బృందం గత ప్రభుత్వంలో అసలు హంతకుల వైపు మళ్లింది. వెనకున్న పెద్దల్ని బయటికి లాగేదాకా వెళ్లడంతో వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి కోర్టు హాల్లోనే సీబీఐ అధికారుల బృందానికి నాయకత్వం వహిస్తున్న ఎస్పీ రామ్‌సింగ్‌పై చిందులేశారు. ఆ వెంటనే కడప ఎస్పీ అన్నురాజన్‌కు అవినాశ్ అనుచరుడు గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి (వివేకా హత్య కేసు నిందితుడు) ఫిర్యాదు చేయడంతో రిమ్స్ పోలీసు స్టేషన్లో సీబీఐ అధికారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ రాష్ట్రంతో కానీ, ఇక్కడి రాజకీయాలతో కానీ సంబంధం లేని ఉత్తరాదికి చెందిన సీబీఐ అధికారిపై కేసు నమోదుచేయడం అప్పట్లో జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ఆ తర్వాత తాడిపత్రిలో ఉంటున్న మరో వ్యక్తిని ఈ కేసులో ప్రశ్నించేందుకు సీబీఐ అధికారులు నోటీసు ఇవ్వగా.. తనను బెదిరిస్తున్నారంటూ ఆయనతో అనంతపురం ఎస్పీ ఫక్కీరప్పకు వైసీపీ పెద్దలు ఫిర్యాదు చేయించారు. ఇంకేముంది ఫక్కీరప్ప వెంటనే తాడిపత్రి పోలీసులతో కేసు నమోదు చేయించారు. దీంతో రామ్‌సింగ్ బృందం ఢిల్లీలోని సీబీఐ హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లి జగన్ పార్టీ కుట్రల్ని వివరించింది. అంతకన్నా పై స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించిన సీబీఐ వివేకా కేసులో సంబంధం ఉన్న ఒక్కొక్కరినీ అరెస్టు చేసింది. అందులో గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి కూడా ఉండటం గమనార్హం. వైసీపీ ప్రభుత్వంలో ఐపీఎస్ అధికారులు చేసిన తప్పులు ఇప్పుడు వారి మెడకు చుట్టుకొంటున్నాయి. పది రోజుల క్రితం రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఢిల్లీలోని సీబీఐ డైరెక్టర్ నుంచి లేఖ వచ్చింది. సంచలనం సృష్టించిన ఒక హత్య కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులపైనే కేసులు నమోదు చేయించిన ఏపీ పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ముఖ్యంగా అప్పటి కడప ఎస్పీ అన్నురాజన్, అనంతపురం ఎస్పీ ఫక్కీరప్ప దర్యాప్తునకు అడ్డుపడ్డారంటూ వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరినట్లు సమచారం. ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ పెద్దలు ఆదేశించినట్లు తెలిసింది. నెల్లూరులో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిపై సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కేసులో ఏకపక్షంగా వ్యవహరించిన అప్పటి నెల్లూరు ఎస్పీ విజయా రావుపైనా చట్టపరమైన చర్యలకు ప్రభుత్వం ఉపక్రమిస్తున్నట్లు తెలుస్తోంది.కొందరు అధికారులు ఐపీఎసలమనే విషయాన్ని మరిచిపోయారు. గత ప్రభుత్వంలో వైసీపీ పెద్దలు చెప్పినట్టల్లా చేశారు.

# గురువులకే గురువు సర్వేపల్లి..



**వృత్తి రీత్యా, వ్యక్తిత్వ రీత్యా, సంస్కార రీత్యా సర్వేపల్లి మహోన్నతుడు. పువ్వ పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు చిన్నతనం నుంచి అసాధారణ ప్ల పాటవాలను ప్రదర్శించిన డాక్టర్ సర్వేపల్లి.. స్వశక్తితో ఉన్నత శిఖరాలకు ఎదిగి పలువురికి మార్గదర్శకంగా, తన వృత్తి ధర్మానికి మకుటంగా వెలిగారు. గురువులకే గురువుగా ఉపాధ్యాయవృత్తికే ఆదర్శంగా నిలిచిన ఆయన.. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని ఓ తెలుగు కుటుంబంలో జన్మించారు. విద్యార్థికి, ఉపాధ్యాయుడికీ మధ్య సంబంధం ఎలా ఉండాలో విడమరిచి చెప్పారు ఆచార్య రాధాకృష్ణ.ఉపాధ్యాయవృత్తికే ఆదర్శంగా నిలిచిన ఆచార్యులు సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆయన తెలుగు వారు కావడం మనందరికీ గర్వకారణం. ఆయన పుట్టిన రోజైన సెప్టెంబర్ 5న ఏటా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకొంటున్నాం. ఆయన నాలుగు దశాబ్దాల పాటు ఉపాధ్యా వృత్తిలో ఉండి విద్యార్థుల మధ్యనే గడిపారు. ఎదుటివారికి బోధించటం వల్ల తన విజ్ఞానం కూడా వృద్ధి చెందుతుందని మనసా వాచా నమ్మిన వ్యక్తి సర్వేపల్లి. కష్టమైన అంశాన్ని కూడా విద్యార్థులకు అతి సులభంగా బోధించేవారాయన. ఉపాధ్యాయుడి బాధ్యత ఎప్పుడూ గురుతరమైనదే. అలాంటి బోధనావృత్తికి తలమానికంగా నిలిచిన సర్వేపల్లి గురించి క్లుప్తంగా..**

విజయవాడ, ఆంధ్ర ప్రగతి సెప్టెంబర్ 4: సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబర్ 5న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీ. దూరంలోని తిరుత్తణిలో జన్మించారు. ఇది తిరుపతి సమీపంలో ఉంది. ఆయన తల్లిదండ్రులు సర్వేపల్లి వీరస్వామి, సీతమ్మ. వీరాస్వామి నాటి జమీందారీ వద్ద తహసిల్దార్‌గా పనిచేసేవారు. వీరి మాతృభాష తెలుగు. సర్వేపల్లి బాల్యం, పాఠశాల విద్యాభ్యాసం తిరుత్తణి, తిరుపతిలోనే గడిచిపోయాయి.

ప్రాథమిక విద్య తిరుత్తణిలో పూర్తి చేసిన రాధాకృష్ణన్.. తిరుపతి, నెల్లూరులో తదనంతర విద్యాభ్యాసం సాగించారు. మద్రాసు క్రిస్టియన్ కాలేజీ నుంచి ఎంఏ పట్టా పొందారు. 1906లో తన 16వ ఏట సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు శివకామేశ్వరితో వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. ఆయన సతీమణి 1956లో తన 51వ ఏట మరణించారు. రాధాకృష్ణన్ బాల్యం నుంచే అసాధారణమైన తెలివితేటలు కనబరిచేవారు. ఆయన తెలివితేటలకు ఉపాధ్యాయులు ముగ్ధులయ్యేవారు.

విద్యార్థికి, ఉపాధ్యాయుడికీ మధ్య సంబంధం ఎలా ఉండాలో విడమరిచి చెప్పారు ఆచార్య రాధాకృష్ణ. అధ్యాపకుడిగా, వైస్ ఛాన్సలర్‌గా, దౌత్యవేత్తగా, ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ఆయన సేవలు నిరుపమానం, అనితరసాధ్యం. ఆయన అధిరోహించిన శిఖరాలు ఆయన జీవితంలోని అసాధారణ కోణాలను మనకు వెల్లడి చేస్తాయి.

సర్వేపల్లి 21 ఏళ్ల వయస్సులోనే మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేశారు. తత్వశాస్త్రంలో ఆయన ప్రతిభను గుర్తించిన మైసూరు విశ్వవిద్యాలయం ఆయన్ని ప్రొఫెసర్‌గా ఆహ్వానించింది. ఆయన ఉపన్యాసాలు విద్యార్థులనెంతో ఆకట్టుకునే.

సర్వేపల్లి ప్రతిభ గుర్తించిన డాక్టర్ అశుతోష్ ముఖర్జీ, రవీంద్రనాథ టాగూర్.. కలకత్తా విశ్వవిద్యాలయ ఆచార్య పదవి చేపట్టమని ఆయణ్ని కోరారు. వారి ఆహ్వానం మేరకు ఆయన అక్కడికి వెళ్లారు. అక్కడే ఆయన కీర్తి దశదిశలా వ్యాపించింది.

కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడుగా ఉన్న సమయంలో సర్వేపల్లి 'భారతీయ తత్వశాస్త్రం' అనే గ్రంథం రాశారు. ఆ గ్రంథం విదేశీ పండితుల ప్రశంసలు అందుకుంది. 'మీరు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ తీసుకుని ఉంటే మీకు ఇంకా మరింత గొప్ప పేరు వచ్చేది' అని ఒక మిత్రుడు అనగా.. సర్వేపల్లి 'నేను ఆక్స్‌ఫర్డ్ వెళ్తే.. అధ్యాపకుడిగా మాత్రమే వెళ్తా. విద్యార్థిగా మాత్రం కాదు' అన్నారట. సర్వేపల్లి దేశభక్తి, స్వదేశీ విద్యాలయాలపట్ల గౌరవం, ఆత్మాభిమానానికి ఈ ఘటనను మచ్చుతునకగా పేర్కొంటారు.

ఆ తర్వాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ఆహ్వానం మేరకు సర్వేపల్లి ప్రాచ్య తత్వశాస్త్రంపై ఉపన్యాసాలిచ్చేందుకు అక్కడికి వెళ్లారు. ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికా లాంటి విదేశాల్లో ఉపన్యాసాలు ఇచ్చి మాతృదేశ కీర్తిని పెంచిన ఘనత కూడా ఆయనదే.

1931లో డా. సి.ఆర్. రెడ్డి తర్వాత రాధాకృష్ణన్ ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లరుగా పనిచేశారు. 1931లోనే రాధాకృష్ణన్ 'లీగ్ ఆఫ్ నేషన్స్ ఇంటలెక్చ్యుయల్ కో-ఆపరేషన్ కమిటీ' సభ్యులుగా ఎన్నికయ్యారు. 1936లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రాచ్యమతాల గౌరవాధ్యాపకులుగా పనిచేశారు. 1946లో సర్వేపల్లి భారత రాజ్యాంగ పరిషత్ సభ్యులుగా కీలక పాత్ర పోషించారు. 1947 ఆగస్టు 14, 15 తేదీ మధ్య రాత్రి 'స్వాతంత్ర్యోదయం' సందర్భాన శ్రీ రాధాకృష్ణన్ చేసిన ప్రసంగం భారతీయులను ఎంతో ఉత్తేజపరిచింది.

1ప్రపంచంలోని అనేక విశ్వవిద్యాలయాలు సర్వేపల్లిని గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. 1969లో భారత ప్రభుత్వం 'భారతరత్న'తో సత్కరించింది.

1967లో రాష్ట్రపతి పదవీ విరమణ చేసిన తర్వాత డాక్టర్ సర్వేపల్లి మద్రాసులోని తన సొంత ఇంటికి వెళ్లిపోయారు. చివరి రోజుల్లో తాత్విక చింతన చేస్తూ గడిపారు. 1975 ఏప్రిల్ 17న ఆయన తుదిశ్వాస విడిచారు.

మతం కాలానుగుణంగా మార్పు చెందుతుందన్న విషయం మరచిపోరాదని రాధాకృష్ణన్ అనేవారు. ఉపనిషత్తుల ఉపదేశాలు, బుద్ధుడి బోధనలు, గీతా సందేశం ప్రాతిపదికగా జాతీయ జీవనాన్ని తిరిగి నిర్మించుకోవాలని సందేశం ఇచ్చారు. సమాజంలో పండితులేగాని నిజమైన తత్వవేత్తలు కనిపించడం లేదని, సృజనాత్మకత కొరవడిందని సర్వేపల్లి ఆవేదన వ్యక్తం చేసేవారు. వారసత్వ సంపద ఎవరినీ మానసిక దాస్యానికి గురిచేయకూడదని మన మహర్షులు కూడా హితవు పలికారని.. అలా వారు నూతన సత్యాలు కనుగొనడానికి, అలాంటి పరిష్కారాలనే సూచించడానికి ఆసక్తి కనబరిచారని వివరించారు.

తత్వవేత్తలుగా ప్రసిద్ధి చెందినవారెవరూ రాధాకృష్ణన్ పనిచేసినన్ని రంగాల్లో ప్రవేశించి ఉండరు. ఆయన పాలనాదక్షుడు, రాజనీతిజ్ఞుడు. అన్నింటినీ మించి.. ప్రాచ్య పాశ్చాత్య దేశాల్లో భారతీయ సంస్కృతికి ప్రతినిధిగా వ్యవహరించగలిగిన ప్రజ్ఞాధురీణుడు.

తత్వశాస్త్రాన్ని వర్తమాన పరిస్థితులకు అన్వయించడమే కాకుండా ప్రపంచమంతటికీ వర్తింపజేసిన మేటి రాధాకృష్ణన్. ఆయన పర్యటించని ప్రదేశం లేదు. ఆయనను గౌరవించని స్థలం లేదు.

సర్వేపల్లి ప్రబోధాలు..

'మతం ఆదర్శం - ఆధ్యాత్మిక సంబంధమైన అంతర దృష్టిని పొందడం. దీనికి మార్గమే నైతిక జీవనం, ధ్యానం'

'తత్వవేత్త జ్ఞానాన్ని ప్రేమించేవాడేగానీ జ్ఞాని కాదు.. యాత్ర ముగించడం ముఖ్యం కాదు, యాత్ర చేయడమే ముఖ్యం'

'విద్యార్థి జీవితాన్ని మలిచేది గురువే'

ఈ లోకంలోకి ఎంతో మంది వస్తున్నారు, వెళ్లిపోతున్నారు. కానీ, కొందరు మాత్రమే కారణ జన్ములు. వారు భౌతికంగా ఇక్కడ లేకున్నా.. మన మనసుల్లో ఎప్పుడూ నిలిచే ఉంటారు. అలాంటి మహామహుల్లో ఉత్తములు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆయన కూడా అందరిలా జన్మించినా.. స్వశక్తితో అసాధారణ ప్ల పాటవాలతో ఉన్నత శిఖరాలకు ఎదిగి పలువురికి మార్గదర్శకంగా, తన వృత్తి ధర్మానికి మకుటంగా వెలిగారు. సర్వేపల్లిది కొనితెచ్చుకున్న గౌరవం కాదు. 'కొలిచి' తెచ్చుకున్న గౌరవం, వృత్తి రీత్యా, వ్యక్తిత్వ రీత్యా, సంస్కార రీత్యా ఆయణ్ని వరించింది. ఏ పనిలోనైనా నిబద్ధత కలిగి ఉండాలని ఆయన జీవితం మనకు పాఠం చెబుతుంది. సర్వేపల్లి జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం.

## సర్వేపల్లి ప్రత్యేకతలు..

రాధాకృష్ణన్ అద్వైత వేదాంతి. శంకరుల మాయావాదాన్ని యథాతథంగా స్వీకరించలేదు. తన సొంత భాష్యం రాశారు. ఆయన రచనలు హిందూ ధర్మానికి పునరుద్దీపన కలిగించాయి. దార్శనిక శాస్త్రాలను ఆధునిక అవసరాలకు అనుగుణంగా మలచిన ఘనత సర్వేపల్లికే దక్కుతుంది.

సర్వేపల్లి గొప్ప మానవతావాది. ప్రతి మానవుడూ అతడి మతమేదైనా, సాంఘిక స్థితిగతులేమైనా పరమేశ్వరుడి రూపంలో పుట్టినవాడే అని నమ్మేవారు. ప్రతి మనిషీ ఆ ఈశ్వరుడికి ప్రియపుత్రుడిగా రాణించగల నిగూఢ శక్తులతో జన్మించినవాడేనని ఆయన అభిప్రాయం.

సర్వేపల్లి దృష్టిలో మతం అంటే - శక్తి, సంపదల కోసం కాకుండా.. శాంతి కోసం, సత్యం కోసం నిత్యాన్వేషణ. మతం అనేది సర్వసంగ పరిత్యాగం, ప్రారబ్ధానికి తలొగ్గడమూ కాదు. ధీరోదాత్తంగా సాగిపోవడమే మతం. ప్రస్థాన త్రయానికి ఆంగ్లంలో ఆధునిక దృష్టితో భాష్యం రాశారు సర్వేపల్లి. సోక్రటీస్ మొదలుకొని పాశ్చాత్య దార్శనికవేత్తల వరకు అందరి రచనలూ ఆయనకు కంఠోపాఠమే.

భగవద్గీతను చదివినంత శ్రద్ధాసక్తులతో బైబిల్ చదివారు సర్వేపల్లి. ఖురాన్ ఆయనకు కొట్టిన పిండి. సూఫీ తత్వాన్నీ మథించారు.

సర్వమతాలవారూ ఇతర మతాల పట్ల విశాలమైన, ఉదారమైన దృక్పథాన్ని అవలంబించాలని సర్వేపల్లి ప్రబోధించారు. ఎవరైనా ఇతర మతాలను, సంస్కృతులను విమర్శించడాన్ని ఆయన అంగీకరించేవారు కారు.

**నేడు ఉపాధ్యాయ దినోత్సవం**